వేగంగా పాకిపోతున్న పోలికలు. ఒకరితో మరొకరు. ఆభరణాలు, చదువులు, చికిత్స కోసం చేరిన కార్పొరేట్ దవాఖానలు, చీరలు, ఇంకా.. ఇంకా! పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన రకరకాల పార్టీలకైన ఖర్చులు, అన్నిటా అన్ని కోణాల్లోంచి పోల్చుకోవడాలు. చనిపోయిన విధా నాల్లో, చావు విందుల ఖర్చులు.. గొప్పగా కనిపించే దుకు, పుట్టుకతో వచ్చిన రంగును మరో రంగుతో కప్పే యడానికి చేసే ప్రయత్నాలు.. మానసిక ఆందోళనలు, చిరాకు, వ్యాకులత, విసుగు, మానసిక రుగ్మత! మనుషు లకు తెలియకుండానే వారి మనసుల్ని నిశ్శబ్దంగా డొల్లల్ని చేస్తూ.. మానసిక రోగుల జనాభాను పెంచుతున్న కాక్టస్!

* * *

''ఈ బతుకింతే! ఇంట్లోనే చాకిరీ. మూడేళ్లయ్యింది. ఎక్కడికీ వెళ్లలేదు. ఓ బెంగళూరు లేదు. ఓ సింగపూరు లేదు!''.. భర్త చెవుల్లో ఈ మాటలు పడేట్టుగా, తెలివిగా తనలోతానే అనుకొన్నట్టుగా.. గట్టిగానే అన్నది మైథిలి.

పొద్దున లేవగానే మొబైల్‌లో స్టేటస్‌లో కొన్ని ఫొటోలు చూసినప్పటినుంచీ మనసు నిలకడలో లేదు. దగ్గరివారు విహారయాత్రలో ఉన్నారు. ప్రదేశాల్ని చూసేకొద్దీ.. ఫొటోల్ని వారు స్టేటస్‌లో పెడుతున్నారు. ఎక్కడలేని ఆనందం వాళ్ల మొహాల్లోనే కేంద్రీకృతమైన ట్టుగా.. పోజులుపెట్టి కనిపిస్తున్నారు. ఇతరుల్లో అలజడి రేపడానికి! బంగాళాఖాతంలో వాయుగుండమే! తీరం వైపు తరలివస్తుంది.. జీవితాల్ని తాకడానికి!

మార్నింగ్ టీ చేస్తుందే కానీ, మైథిలి ఆలోచనలు తన 'చిన్నప్పటి' స్నేహితురాళ్లు, 'దగ్గరి' బంధువులు పొందు తున్న 'సంతోషాల' గురించే.. అవసరానికి మించి మరిగిన టీని కప్పుల్లో పోసింది. ఫుల్‌గా నిండే కప్పులు.. ఆ రోజు సగానికే నిండాయి! భర్త లోకేశ్‌కు ఫుల్ కప్పు కావాలి. వెంటనే మైథిలి తన దాంట్లోంచి పోసి కప్పును నింపింది. మైథిలి కప్పులో నాలుగు స్పూన్ల టీ!

లోకేశ్‌కు మైథిలి ప్రవర్తన కొత్తేమీ కాదు. కొన్నేళ్లనుంచీ జీవితంలో అది అంతర్భాగమై పోయింది. అంతర్లీన మైంది. నిత్యజీవితపు సమస్యల లిస్టులో చేరిన కొత్త జీవనచర్య. స్టేటస్‌లలో పెట్టిన ఫొటోల్ని చూడటం.. 'కించిత్' నుంచి 'చింతించే' వరకూ బాధపడటం, లేని నవ్వుల్ని, సంతోషాల్ని తెచ్చుకొని పలకరించడం, తాను పోటీగా ఫొటోలు పెట్టి ఇతరుల్లో మానసిక ఆందోళనలకు ప్రేరకాలు కావడం.. ముసురుకొస్తున్న ఈ విషవలయం నుంచి ఎలా బయటపడాలన్న ఆలోచనలు లోకేశ్‌ను సతాయిస్తూనే ఉన్నాయి.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో విశిష్ట బహుమతి పొందిన కథ.

మైథిలి.. నాలుగు చెంచాల టీని నిండుకప్పును తాగినట్టుగా నటించి, లోకేశ్ పక్కనుంచి లేచి వెళ్లింది.

లోకేశ్ టీని సిప్ చేస్తుంటే.. గతంలో తామిద్దరూ చేసిన విహారయాత్రలు గుర్తుకొచ్చాయి. ప్రతి ప్రయాణంలో లోకేశ్‌కు మైథిలి లోతుగా అర్థమయ్యింది. అప్పుడే తనకు తెలిసింది.. మైథిలిని స్టేటస్ వైరస్ ఎలా పెనవేసుకున్నదో!

అల్పపీడనంతో ఇంట్లో వర్షాలు మొదలయ్యాయి.

ఎప్పటినుంచో అనుకొంటున్న ఉదయ్‌పూర్‌కు ప్రయాణం ఖరారు.

* * *

''ఎట్ లాస్ట్.. రాజస్థాన్‌లో అడుగుపెట్టాం! ఇన్నాళ్లకు ఈ కోరిక నెరవేరింది!''..

హోటల్ గదిలో అడుగుపెడుతూనే.. లోకేశ్‌ను చుట్టే సుకొని, కల నిజమైన ఉత్సాహంతో అన్నది మైథిలి.

లోకేశ్ మరింత గట్టిగా హత్తుకొని.. మైథిలిపై ముద్దుల జల్లుల్ని కురిపించాడు.

''వెడ్డింగ్ యానివర్సరీకి రాజస్థాన్ ఛలో! మాటి చ్చాను కదా.. వి మేడ్ ఇట్! ఎంజాయ్!''..

మైథిలికి ఇష్టమైన రాష్ట్రం. ఎప్పటినుంచో చూడాలన్న కోరిక నెరవేరుతున్నందుకు లోకేశ్ అమితానందంతో ఉన్నాడు. సంతోషంలోంచి ఇంకా తేరుకోకముందే.. మైథిలికి చటుక్కున గుర్తొచ్చింది.

''సెల్ఫీ ప్లీజ్..'' అంటూ ఓ ఫొటో తీసింది.

పరీక్షగా చూసి, బాగా రాలేదని.. లోకేశ్‌ను మరింత దగ్గరగా హత్తుకొని సంతోషాన్నంతా పెదాలు, దంతాల ద్వారం కనిపించేలా మరికొన్ని సెల్ఫీలను తీసింది. హోటల్లోకి ప్రవేశించే ముందే.. ఆ బిల్డింగ్ ఫొటోను తీసే సింది. కొన్ని ఫొటోలను సెలక్ట్ చేసి స్టేటస్‌లో పెట్టింది. సంతోషంతో విజిల్ వేసుకొంటూ హోటల్ గదిని పరిశీ లించడం మొదలుపెట్టింది. హైపర్ సంతోషంతో కనిపి స్తున్న మైథిలిని గమనిస్తూనే ఉన్నాడు లోకేశ్.

తనలో తాను నవ్వుకున్నాడు. వారంరోజులు నవ్వు కుంటూనే సరదాగా గడుపుతానని రెట్టింపు సంతోషంతో ఉన్నాడు!

* * *

గంటలో.. లోకేశ్‌కు మొదటి కాల్, ఫ్యామిలీ ఫ్రెండ్ భాను నుంచి వచ్చింది.

''ఏరా? మీరు రాజస్థాన్ వెళ్తున్నారని చెప్పనేలేదు. ఇప్పుడే మైథిలి స్టేటస్‌లో పెట్టిన ఫొటో చూసి, రాధిక చూపించింది నాకు. మేమూ వచ్చేవాళ్లం. కంపెనీ ఉంటే రెండు కుటుంబాలకూ ఎంతో సరదాగా ఉండేది కదా!''.

''అనుకోకుండా జరిగిపోయిందిరా! నేనూ అనుకో న్నాను, మీరుంటే ఈ ట్రిప్పు మరింత సంతోషంగా గడి పేవాళ్లం కదా అని?''.

వాళ్ల సంభాషణ వింటున్న మైథిలి.. పళ్లు కొరుకుతూ లోకేశ్ వైపు కోపంగా చూసింది.

ఇటు తెలుగురాష్ట్రంలో ఉన్న రాధిక కూడా.. తన భర్త భానుయే ఫోన్‌చేసి లోకేశ్‌తో మాట్లాడుతున్నందుకు..

'నీ పని పడతాను!' అని అర్థం వచ్చే చూపులతో, చేష్టలతో తన పని కానిస్తున్నది.

రాధిక మొహం క్రమేణా కాళికాదేవి రూపంలోకి మారుతున్నట్టుగా భానుకి అనిపించింది. అంతే! ఒక్క సారిగా అతని మాటలు తడబడి.. లయ తప్పాయి.